www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 17 మే 2023
5
అన్నమయ్య

ఖాతాదారులతో కిక్కిరిసిన ఎపిజిబి

బ్యాంకులో కిటకిటలాడుతున్న ఖాతాదారులు

గాలివీడు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణాలు రెన్యువల్స్ కావడంతో మంగళవారం రైతుల సందడి నెలకొంది. శని ఆదివారం బ్యాంకు సెలవు రోజులు కావడంతో సోమవారం నుంచి డ్వాక్రా మహిళలు ఆధార్ అప్‌డేషన్‌కు, రైతులు రుణాలు రెన్యువల్ చేసుకోవడానికి బ్యాంకుకు వచ్చారు. దీంతో బ్యాంకు జనాలతో కిక్కిరిసిపోయింది. మండలంలో 17 గ్రామాల్లో అరవీడు, ప్యారంపల్లి, తూముకుంట గ్రామాలు ఎస్‌బిఐ కిందకు పోగా మిగిలిన 14 గ్రామాలకు చెందిన రైతందరూ ఎపిజిబి పరిధిలోకి వస్తారు. వీరందరూ రుణాలను రెన్యువల్ చేసుకోవడానికి బ్యాంకుకు వచ్చారు. వారితో పాటు డ్వాక్రా మహిళలు రావడంతో బ్యాంకు అంతా నిండింది. బ్యాంకులో కౌంటర్లు పరిమిత సంఖ్యలో ఉండడంతో సాయంత్రం 5 గంటలైనా జన సందడి ఏమాత్రం తగ్గలేదు.

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొడదాం

మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మహానాడుకు హాజరైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో అరాచకాలు ఎక్కువయ్యాయని, తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దామని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రాజధాని ఫంక్షన్ హాల్‌లో ఎన్టీఆర్ వందవ జయంతి సందర్భంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాలకు మినీ మహానాడును ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. సమావేశానికి పొలిట్ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్ర మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో 165 సీట్లు టిడిపికి గెలిపించాలని కోరారు. అందరం కలిసి పార్టీ కోసం పని చేయాలని పనిచేయాలన్నారు. యువత ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నందమూరి తారక రామారావు టిడిపిని స్థాపించడం వల్ల అన్ని సామాజిక వర్గాలకు పథకాలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపిని గెలిపించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేయాలని పేర్కొన్నారు. పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జి గంటా నరహరి, పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ఆర్.రమేష్ కుమార్ రెడ్డి, చంగల్ రాయుడు, చల్లా రామచంద్రారెడ్డి, విశ్వనాథ నాయుడు, దొమలపాటి రమేష్, మాజీ ఎమ్మెల్యే షాజహాన్, మాజీ జడ్పీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, టిడిపి నియోజకవర్గ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ నాయకులు రాజు చమ్మర్తి జగన్ మోహన్ రాజు, శ్రీనాథ్ రెడ్డి, అనిపొరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ మహిళ ఉపాధ్యక్షులు డి.వాణి శంకర్, రాజంపేట మహిళ అధికార ప్రతినిధి కె.సునీత, హరిప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌వల్లి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, మాజీ జడ్‌పిటిసిలు మాజీ ఎంపిపిలు, మాజీ కౌన్సిలర్లు, అన్ని మండలాల టిడిపి మండల అధ్యక్షులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి వైసిపి ప్రభుత్వం : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

హజ్ యాత్రకు వెళ్లే వారికి రాష్ట్ర ప్రభుత్వం తోడుగా నిలిచి మైనారిటీల పక్షపాతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని మరోమారు నిరూపించుకుందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌కు వెళ్లాలంటే అవకాశం ఉండేది కాదన్నారు., ఇప్పుడు విజయవాడ నుంచి వెళ్లే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించి యాత్రికుల కల నెరవేర్చిందన్నారు. హజ్ యాత్రకు బెంగుళూరు, హైదరాబాద్‌ల నుంచి వెళ్లే దానికంటే, విజయవాడ నుంచి వెళ్ళేవాళ్లకు రూ 80 వేలు అదనంగా విమాన టికెట్ ధరల భారం పడుతోందని, సిఎం జగన్ స్పందించి రాష్ట్రం నుంచి నమోదయి హజ్ యాత్రకు వెల్లుచున్న యాత్రికులకు ఏదైతే 80 వేలు పడుతున్న అదనపు భారాన్ని ప్రభుత్వం భరిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లో కూడా యాత్రికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారన్నారు. రాష్ట్రం నుంచి వెళ్లబోయే 1813 హజ్ యాత్రికులకు సంబంధించి ఒకొక్కరికి అదనంగా పడుతున్న రూ.80 వేల చొప్పున రూ.14.51 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. సెంట్రల్ హజ్ కమిటీకి ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు చేసే పక్రియ ప్రారంభమైందని తెలిపారు. విషయంలో గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో ఉన్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్ సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట పట్టణంలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ప్రభుత్వానికి విరుద్ధంగా అడ్మిషన్లు జరుపుతున్నారని.. టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్ అని అనేక రకరకాల పేర్లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ పాఠ్యపుస్తకాలు అని అనేక రకాలుగా దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్, కార్పొరేట్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను యాజమాన్యాలు వేధిస్తున్నాయని, ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న పాఠశాలలపై తక్షణమే చటపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేటలోని శ్రీసాయి విద్యాలయం పాఠశాల ఆగడాలు మితిమీరి పోయాయన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉంటూ ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తూ విద్యను వ్యాపార సరుకుగాచేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులపైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులకు పలు దఫాలుగా తెలియజేసినా ఇంత వరకు చర్యలు తీసుకోవడంలో పూర్తి వైఫల్యం చెందారని విమర్శించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పాఠశాలల ఎదుట ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు అఖిల్, శుబన్, సాయి, కార్తీక్, వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రామాపురం : జిల్లా గ్రంథాలయ సంస్థ కడప వారి ఆధ్వర్యంలో అన్ని గ్రంథాలయాల పరిధిలో ఈనెల 8వ నుంచి జూన్ 16 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రామాపురం శాఖ గ్రంథాలయ పరిధిలో విద్యార్థులకు వ్యాసాలు పోటీలు నిర్వహించారు. విద్యార్థులందరూ సెలవులను వృథా చేయకుండా గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి చెప్పారు గ్రంథాలయంలో పిల్లలకు పెద్దలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటితోపాటు దినపత్రికలు, మాసపత్రికలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

క్రికెట్ స్టేడియం పనులు త్వరగా పూర్తి చేయాలి

రాయచోటి: క్రికెట్ స్టేడియం పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. మంగళవారం రాయచోటి శివారు ప్రాం తమైన నక్కాలవాండ్లపల్లె సమీపంలో క్రికెట్ స్టేడియం భూమి చదును పను లను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. మట్టి చదును పనులను పరిశీలించి క్రికెట్ మైదానంలో పిచ్ ఎక్కడ వస్తుంది వంటి వివరాలను అడిగి తెలుసు కున్నారు. వాకింగ్ ట్రాక్ కూడా వేయాలని సూచించారు. స్టేడియం ఫెన్సింగ్ పనులు కూడా త్వరగా మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. చేసే పనులన్నీ నాణ్యతతో శాశ్వతంగా ఉండేలా చేపట్టాలన్నారు. సాధ్యమైనంత త్వరగా క్రికెట్ స్టేడియం పూర్తి చేసి అందుబాటులో తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేడియానికి వచ్చేందుకు సమీపంలోని ప్రధాన రహదారిని కలిపేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. భూమి చదును పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఇన్‌ఛార్జి ఎస్ఇ సహదేవరెడ్డి, డిఇ సురేష్‌నాయక్, కమిషనర్ గంగాధరరావు, ప్రేమంతకుమార్ పాల్గొన్నారు.

స్టేడియం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల

ప్రజల ఆరో గ్యమే ప్రభుత్వ ధ్యే యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపి డిఒ కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పం పిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఐదు మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.16 లక్షలు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, వెంకట రమణారెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ జిల్లా కమిటీలో మదనపల్లెకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 మరియు ఎపి సీనియర్ సిటిజన్స్ రూల్స్ 2011 జిల్లా కన్స్టిట్యూషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ జిల్లా నూతన కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె పట్టణానికి చెందిన పలువురికి చోటుకల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ జిఒ ఎంఎస్ నెంబర్ 17 ప్రకారం మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల విభాగాల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రపంచీకరణ, సరళీకరణ, వేగంగా మారుతున్న సామాజిక నైతికత కారణంగా వృద్ధులకు అంతకుముందు అందుబాటులో ఉన్న సాంప్రదాయ మద్దతు యంత్రాంగాలు క్షీణించాయని, దీంతో సీనియర్ సిటిజన్‌లు ఇళ్లు లేక వృద్ధాశ్రమాల్లో ఒంటరి జీవితానికి పరిమితమయ్యే పరిస్థితి నెలకొందన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా సీనియర్ సిటిజన్స్ జిల్లా కమిటీకి మేజిస్ట్రేట్ చైర్‌పర్సన్‌గా కలెక్టర్ గిరీష వ్యవహరిస్తారని, సభ్యులుగా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సభ్యుడు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి, జిల్లా కో-ఆర్డినేటర్ హాస్పిటల్ సేవలు, ప్రాజెక్ట్ డైరెక్టర్, డిఆర్‌డిఎ, ఐకెపి, ఎన్జీఓ నుండి ముగ్గురు సభ్యులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ రంగంలో నిపుణులు, కార్యకర్తలు, వీరిలో ఒకరు మహిళ ఉంటారన్నారు. ఇదే కమిటీల సభ్యులుగా ఎం.ఉదయ్మోహన్‌రెడ్డి, కార్యదర్శి, వెలుగు వృద్ధ మహిళల ఆశ్రమం (మదనపల్లె), డాక్టర్ ఆదినారాయణ రెడ్డి కార్యదర్శి,సర్వోదయ వృద్ధాశ్రమం (కలికిరి) ఆర్.భాగ్యలక్ష్మి కార్యదర్శి, పద్మజ వృద్ధాశ్రమం మరియు ముగ్గురు ప్రముఖ సీనియర్ సిటిజన్ల నుండి సభ్యులు, వీరిలో ఒకరు మహిళలు.ఎన్.మునిగోపాల కృష్ణ, మునిరత్నమయ్య, కె.శకుంతలమ్మ (మదనపల్లి) ఎక్స్-అఫీషియో మెంబరుగా వ్యవహరిస్తారన్నారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమమే ధ్యేయంగా కమిటీ పనిచేస్తుందని స్పష్టం చేశారు.జిల్లా కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై సీనియర్ సిటిజన్ల సమస్యలను సమీక్షిస్తామని వెల్లడించారు.

నాణ్యతతో 'నాడు-నేడు' పనులు : కలెక్టర్

ప్రజాశక్తి-సంబేపల్లె (రాయచోటి)

నాడు- నేడు పనులు పక్కా నాణ్యతతో సాగాలని కలెక్టర్ గిరీష ఆదేశించారు. మంగళవారం సంబేపల్లి మండలం, పెద్ద జంగంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మనబడి నాడు నేడు రెండో దశ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఫ్లోరింగ్, బెడ్, టాయిలెట్స్ మరమ్మతులు తదితర పనులను కలెక్టర్ పరిశీలించి ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు, ఎంత ఖర్చు చేయాలి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేయలని ఆదేశించారు. ఆయన వెంట డిఇఒ పురుషోత్తం, తహశీల్దార్ మహేశ్వరి బాయి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, ఎఇ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడీ టీచర్‌ను కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని మోటకట్ల గ్రామం, కేతంరెడ్డి గారిపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన అకస్మింగా తనిఖీ చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నారు, ఇప్పుడు ఎంతమంది హాజరయ్యారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో మీ వయసెంత, ఏ తరగతని ఆప్యాయంగా పిల్లలను పలకరిస్తూ ముచ్చటించారు. ఆంగ్లం, తెలుగులో వర్ణమాలలు పిల్లలని కలెక్టర్ అడిగి తెలుసుకుని బాగా చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రంలో వండిన భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. పిల్లల హాజరు రికార్డులను పరిశీలించి హాజరులో వ్యత్యాసం ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్ వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఆధార్ మ్యాపింగ్ అయిందా లేదా అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో బలహీనమైన పిల్లలు ఉంటే అదనంగా పౌష్టికాహారం అందించాలని తెలిపారు. తనిఖీలో ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి, డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, తహశీల్దార్ మహేశ్వరి బాయి, సిడిపిఒ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ఆస్పత్రిలో ఓపి సంఖ్యను పెంచండి

ఆస్పత్రిలో ఒపి సంఖ్యను మరింత పెంచాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గిరీష ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల రూము, ల్యాబ్, స్టోర్ గదులను, రికార్డులను, ఆస్పత్రి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. డెలివరీలు నెలకి ఎన్ని జరుగుతున్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకుని డెలివరీల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా పేదలు వస్తుంటారని, మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. తనిఖీలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, తహశీల్దార్ మహేశ్వరి బాయి, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విహార, విజ్ఞాన యాత్రలకు ప్రత్యేక బస్సులు

విజ్ఞాన యాత్రపై ప్రచారం నిర్వహిస్తున్న మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమణ బృందం

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక ఆర్‌టిసి డిపో నుంచి విహార, తీర్థ, విజ్ఞాన యాత్రల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కెవి.రమణ, జి.ప్రమీల తెలిపారు. మంగళవారం వారు ఈ మేరకు పీలేరు పట్టణంలో కరపత్రాలతో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో మేనేజర్ బండ్ల కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 20న విహార యాత్రల కోసం కేరళలోని మున్నార్‌కు ఒక బస్సు, 25న మరో బస్సును నడుపనున్నట్లు చెప్పారు. 25న భద్రాచలం, మంత్రాలయం, శ్రీశైలం, తమిళనాడులోని వేలాంగని, హైదరాబాద్ ముచ్చింతల తీర్థ యాత్రల కోసం 40 సీట్ల అల్ట్రా డీలక్స్ బస్సు పీలేరు నుండి నడపనున్నట్లు తెలిపారు. పీలేరు నుండి మంత్రాలయం, మహానంది, అహోబిలం, యాగంటి తీర్థయాత్ర కూడా ఉందన్నారు. విజ్ఞాన యాత్రలో భాగంగా ఈ నెల 29న శ్రీహరికోటలో రాకెట్ లాంచింగ్ కార్యక్రమాన్ని వీక్షించడానికి కూడా ఓ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందరికీ అందుబాటులో ఉండే టికెట్ ధరలపైప్ ఈ యాత్రలను చేపట్టామని, ఆసక్తిగలవారు త్వరగా తమ టికెట్లను నమోదు చేసుకోగలరని తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం 7893152748, 7382878751 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

కమిషనర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సచివాలయం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కోరుతూ సచివాలయం ఉద్యోగులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజ మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకు మదనపల్లి మున్సిపాలిటీ నందు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు అందజేయాలన్నారు. సచివాలయం సిబ్బంది యొక్క సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా అందరికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. వివిధ కారణాలతో పెండింగ్ ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రెండో విడతలో నియమించబడిన సచివాలయం ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని.ఈ విషయంపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, వార్డ్ సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు రెహమాన్, లీలావతి, వినోద్ కుమార్ విజకుమార్ రెడ్డి, రాజారెడ్డి, అభిషేక్, సతీష్, జనార్ధన్, నందిని, హరి, శరత్, రెడ్డెప్ప అధిక సంఖ్యలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణాలు త్వరగా మంజూరు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న హౌసింగ్ కాలనీలలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలలో సెంట్రింగ్ పనులకు రుణాలు త్వరగా మంజూరు చేయాలని, మండలానికి రెండు చొప్పున రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ గిరీష జగనన్న హౌసింగ్ కాలనీలపై బ్యాంకర్లతో సమీక్ష సమావేశంలో బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జగనన్న హౌసింగ్ కాలనీలలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వివిధ బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడానికి బ్యాంకర్ల సహకారం అవసరమని, ఇందులో భాగంగా సెంట్రింగ్ పనులకు బ్యాంకర్లు రుణాలను ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని సూచించారు. మండలానికి రెండు రుణాలు చొప్పున పిఎంఇజిపి కింద బ్యాంకులు రుణాలు ఇస్తే ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయవచ్చని ఆయన అన్నారు. సమీక్ష సమావేశంలో వివిధ బ్యాంక్ మేనేజర్లు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డిపిఎంఒ లోకవర్ధన్

'ఫ్యామిలీ డాక్టరు'తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-కలికిరి

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. మంగళవారం మండలంలోని మెడికుర్తి సిహెచ్‌సి వైద్యులు కావ్య ఆధ్వర్యంలో కలికిరి ఎస్టీ కాలనీలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాలు అందేటట్లు చూడాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంతమంది పేషెంట్లు పాల్గొన్నారు, వారికి ఎలాంటి పరీక్షలు నిర్వహించారు, రోగులకు మందులు సక్రమంగా అందుతున్నాయా లేదా అనేదానిపై విచారణ చేపట్టారు. ఏఎన్ఎం, ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేసుకుని డిశ్చార్జ్ అయి పది రోజుల తర్వాత వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై పరీక్షించి ఏమైనా సమస్యలు తలెత్తితే ఆన్లైన్ చేసి పరిష్కరించాలని, ప్రతి ఒక్క గర్భవతికి కూడా అనీమియా రక్త పరీక్షలు వారిని రక్తహీనత బారిన పడకుండా కాపాడాలని, 104 సేవలను విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

వినోదంతో పాటు విజ్ఞానం :'మడితాటి'

ప్రజాశక్తి - సంబేపల్లె (రాయచోటి)

వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందుతుందని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరంలో చేతిరాత, ఇంగ్లీష్, తెలుగు గ్రామర్, నీతి కథలు చెప్పడం, బొమ్మల గీయడం, కాగితంతో ఆట వస్తువుల తయారీ, యోగా, ధ్యానం వంటి వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. కృత్యాధార బోధన ద్వారా నిర్వహించే ఈ వేసవి విజ్ఞాన శిక్షణ విద్యార్థులకు ఉత్సాహాన్ని, వినోదాన్ని, సృజనాత్మక ఆలోచనలను కలగజేస్తుందన్నారు. విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబేపల్లి గ్రంథాలయ శాఖ నిర్వాహకులు రెడ్డిశేఖర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు అల్లరి చిల్లరిగా తిరగకుండా, ఎండ వేడిమికి గురికాకుండా ఉండేందుకు పాఠశాలలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని నెల రోజులపాటు నిర్వహిస్తారని, అనంతరం విద్యార్థులందరికీ నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోసఫ్, ఆంజనేయులు, ఉపాధ్యాయిని శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మడితాటి నరసింహారెడ్డి

గ్రామ సభలతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే 'మేడా'

ప్రజాశక్తి- వీరబల్లి

గ్రామ సభలు నిర్వహించడం వల్ల గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఎంపిడిఒ మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహిస్తే సమస్యలు పరిష్కారమయ్యి రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ప్రథమ పౌరిడిగా సర్పంచ్, మండల అధికారులు, ప్రజల సమక్షంలో గ్రామాలకు చేయాల్సిన మంచి కార్యక్రమాల గురించి చర్చించుకొని తీర్మానించాలన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా అభివృద్ధి పనులకు ఉపయోగించాలని చెప్పారు. ముఖ్యంగా ఉపాధి పనులు, రోడ్లు, తాగు, సాగు నీరు వంటి వాటికి ఖర్చు చేయాలన్నారు. ప్రజల సమక్షంలోనే గ్రామానికి సంబంధించిన తీర్మాణాలు జరగాలన్నారు. తాటి గుంటపల్లి ఎంపిటిసి పురుషోత్తం రెడ్డి ఒక అధికారిపై అవకతవకలపై ఫిర్యాదు చేశారు. ప్రజల సమస్యలు తీర్చలేని అధికారులను విధుల నుంచి తొలగించాలని లేకపోతే బదిలీపై వెళ్లాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. సమావేశంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు. వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పెద్దివీడు గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన ఉపాధి గ్రామ సభలో సర్పంచ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైనా గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ తులసమ్మ, ఏపీడీ రెడ్డయ్య నాయుడు ఆయా శాఖ అధికారులు, మండల వైసిపి నాయకులు గాలివీటి వీరనగి రెడ్డి, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపిపి శ్రీదేవి

మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి -కలకడ

వైద్యశాలకు వైద్యం కోసం వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా పలకరించి వైద్య సేవలు అందించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ప్రతి ఒక్కరూ సమయాపాలన పాటించి వైద్య సేవలకు వచ్చి తమ విధులను నిర్వహించుకోవాలన్నారు. వైద్యశాలలో ఉన్న అత్యవసర మందులు విభాగం రిజిస్టర్లను, ఇన్ పేషెంట్ ,ఔట్ పేషెంట్ రిజిస్టర్‌లను పరిశీలించినట్లు తెలిపారు. వైద్యశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తగు సూచనలు సలహాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి మల్లికార్జున ఎంపిహెచ్ఒ వెంకటేశు, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వర రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిరంతర అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, దిశా ఆప్ డౌన్లోడ్లను పెంచుతూ సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించాలని టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు మహిళా సంరక్షణ పోలీసుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐ మాట్లాడుతూ మహిళా సంరక్షణ పోలీసులు ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నేరాల నియంత్రణకు ప్రజలలో అవగాహన కల్పించాలని, ఎల్‌హెచ్‌ఎంఎస్ గురించి మరియు ఫ్యామిలీ కౌన్సిలింగ్ గురించి, వేసవి సెలవుల్లో ఎవరైనా వాళ్ల ఊర్లకు గాని టూర్లకు గాని వెళ్ళినప్పుడు వారి ఇంటిలో విలువైన బంగారుఆభరణాలను డబ్బులను ఉంచి వెళ్లకుండా బ్యాంకు లాకర్లో భద్రపరుచుకోవడం సురక్షితమని ప్రజలకు వివరించాలని తెలిపారు. చైన్ స్నాచింగ్ జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రజలను చైతన్యవంతం చేయాలని తెలియజేశారు. సిసి కెమెరాలు ప్రస్తుతము ఎన్ని ప్రదేశాలలో అవసరం గుర్తించి ఆ షాపు యజమానులు గాని ప్రధాన ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేసుకునే విధంగా చైతన్య పరచాలని తెలియజేశారు.గంజాయి మద్యం నాటు సారాలకు బానిసైన వ్యక్తుల సమాచారం సేకరించి వారిని డి అడిక్షన్ సెంటర్కు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని, అక్రమ నాటు సారా గంజాయికి సంబంధించిన సమాచారాన్ని వెంటనే సేకరించి తమకు తెలియ పరచాలని అన్నారు. పట్టణ పరిధిలో ఏ చిన్న సంఘటన జరిగిన అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ లోకేష్‌రెడ్డి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న గురుకుల పాఠశాల సిబ్బంది

పాఠశాల కార్యదర్శి కృష్ణ మోహన్‌కు సన్మానం

ప్రజాశక్తి-నందలూరు

మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ప్రైవేట్ ఏజెన్సీ కింద సుమారు 1450 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తూ సకాలనికి జీతాలు అందక ఇబ్బందులు పడేవారు. దీనికి ఆ సంస్థ కార్యదర్శి ఆకేపాటి కృష్ణమోహన్ ఒక్కసారిగా అందరిని ఆప్కాస్‌లో చేర్చేల కృషి చేసి చేశారు. మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మరియు పాత కడప జిల్లా అధ్యక్షులు ఎ.ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదయ్య, కడప, కర్నూల్, నెల్లూరు, అమలాపురం పాఠశాల సిబ్బంది సహకారంతో మంగళగిరి సత్కరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డిప్యూటీ సెక్రెటరీ సుభాషిణి, దేవమ్మ, సంఘ గౌరవ అధ్యక్షులు శివ కాంత్, అధ్యక్షులు మనోహర్ నాయుడు, జనరల్ సెక్రెటరీ కృష్ణమోహన్, టి.వి.రమణ, ఉపాధ్యక్షులు సిద్ధలింగయ్య, కోశాధికారి రామచంద్ర రావు, ఎక్జిక్యూటివ్ మెంబెర్స్ రమేష్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రామలింగం నాయుడు మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి -కలకడ

రామలింగం నాయుడు మృతి పార్టీకి తీరని లోటని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవలపల్లి పంచాయతీ దేవులపల్లె టిడిపి మండల అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు సోదరుడు కొత్తూరి రామలింగం నాయుడు ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కిషోర్ కుమార్‌రెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రభాకర్ నాయుడు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. రామలింగం నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదలైన అడ్మిషన్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశ దరఖాస్తులు ఇవ్వడంతో పాటు 15వ తేదీ నుండి మొదటి దశ ప్రవేశాలు ప్రారంభించామని ప్రిన్సిపల్ గోపాల బాలకృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి కోర్సులు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఒకేషనల్ కోర్సులలో నర్సింగ్,(ఎంపిహెచ్ పిఎల్) సిజిటి (గార్మెంట్ ఒక్కాలజీ) సిటి (కన్స్ట్రక్షన్ టెక్నాలజీ) సెరికల్చర్ (పట్టు పరిశ్రమ) ఎలక్ట్రికల్ అకౌంట్స్, టాక్సేషన్ కోర్సులు కలవన్నారు. ప్రతి పాఠశాలను కళాశాల అధ్యాపకులు సందర్శించి పది పాసైన వారి జాబితాలు తెచ్చి, విద్యార్థినులతో సంభాషిస్తున్నామని వివరించారు. చక్కటి క్రమశిక్షణ, విద్యార్థులకు అవసరమైన పన్సిచర్, టాయిలెట్స్, ఆర్వోవాటర్ విద్యార్థులకు గైడెన్స్ విభాగం, తల్లిదండ్రులతో సమావేశాలు, ప్రోగ్రెస్ కార్డ్స్, ఫ్రీ బుక్స్, అమ్మఒడి, ప్రత్యేక పర్యవేక్షణ వంటివి సృష్టం చేశారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 978, 968, 965, 964, 915, 908, 902, 906, 908 మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో 456, 449, 432, బైపిసిలో 419, 417, సిఇసిలో 463 మార్కులతో కార్పొరేట్ కళాశాలలో సమానంగా అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు.కార్పొరేట్ కాలేజీ ఫీజులు లేకుండా, నామ మాత్రపు ఫీజులతో కార్పొరేట్ విద్యతోబాటు క్రమశిక్షణ అందిస్తామని, కావున ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాలికలందరు చేరి, మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లె : డెంగీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

దోమకాటు వల్ల ప్రాణాంతకమైన జ్వరాలు వస్తాయని, ముఖ్యంగా డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రసాద్ యాదవ్, పిహెచ్‌సి డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని చింతకుంటవండ్లపల్లి, కొనంపేటలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడిస్ అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుందన్నారు. పరి సరాలను పరిశభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ వ్యాధి లక్షణాలు తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు, తలనొప్పి, నొప్పులు, కంటి వెనుక నొప్పి, చర్మం మీద ఎర్రటి మచ్చలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ రవీంద్ర, సూపర్‌వైజర్ ఎం.సురేంద్రారెడ్డి, సతీష్ శివ, చంద్ర, రవికుమార్, రమణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాలుగోన్నారు. **నందలూరు:** చేయి చేయి కలుపుదాం డెంగీ జ్వరాన్ని తరిమికొడదామంటూ పిహెచ్‌సి డాక్టర్ సృజన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్ర శేఖర్‌రెడ్డి, సూపెర్వైసోర్స్, ఎంల్ హెచ్ పిలు, ఎఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు. **కంభంవారిపల్లి :** మండలంలోని గర్నిమిట్ట పిహెచ్‌సి డాక్టర్ రేష్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి, ఆరోగ్య విస్తరణాధికారి కృష్ణయ్య, పర్యవేక్షకులు పురుషోత్తం, చెన్నమ్మ, ఆరోగ్య సిబ్బంది మరియు ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ:** మురికి నీటి కాలువలు గుంతలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలకడ, ఎర్రకోటపల్లి పిహెచ్‌సి డాక్టర్లు మల్లికార్జున జవహర్ బాబు అన్నారు. ర్యాలీలో ఎంపిహెచ్ఇఒలు జయరామయ్య, వెంకటేశు, ఎంపిహెచ్ షేక్ ముజీబ్ బాషా, వెంకటేశ్వరరావు, సుబ్బరతమ్మ పాల్గొన్నారు. **పుల్లంపేట :**మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మనోజ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సామే శేఖర్, పి.హరోహరమ్మ, సూపర్వైజర్లు పి.మహేష్, ఎం.శివ గౌరీ, మలేరియా యూనిట్ అధికారి ఎ.సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** డెంగీ నివారణకు ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పురవీధులలో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ, దోమల నుండి ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మెప్మా కో-ఆర్డినేటర్ శ్రీవాణి, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **పీలేరు :** డెంగీ వ్యాధి పట్ల అవగాహన కలిగి అందుకు కారణమైన దోమలు మనిషిని కుట్టకుండా, అవి పుట్టకుండా చూసుకోవాలని జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ శేషగిరి బాబు తెలిపారు. పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టరు చంద్రశేఖర్ నాయక్, సిహెచ్ఒ జయలక్ష్మి, సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఉషారాణి, కొండయ్య, పర్యవేక్షకులు మోహన్, కుసుమ, ఓఎన్ఎంలు, సిహెచ్ఒలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం :** జాతీయ డెంగీ దినోత్సవంపై మండల కేంద్రంలో వైద్యాధికారులు విజయకుమార్, వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మూడు రోడ్ల కూడలి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వైరల్ ఫీవర్ బారిన పడకుండా ప్రజల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నినాదాలు చేశారు. ర్యాలీలో సిహెచ్ఒ ఏలియజేర్, పిహెచ్ఎన్ విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవేంద్ర రాజు ఉమామహేశ్వరి, ఎంఎల్‌పిలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంభంవారిపల్లె : డెంగీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంక్షేమ పథకాలే వైసిపి బలం : ఎమ్మెల్యే 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాటే వేదవాక్కు.. సంక్షేమ పథకాలే మా బలం అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పంచాయతీ దాసరివాండ్లపల్లి, పూజారివాండ్లపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఏ హామీలు అయితే ఇచ్చారో వాటిని 95 శాతం అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని చెప్పారు. తిరిగి మరల ప్రజల అభివృద్ధి కోసం ఆయన్ని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, నాయకులు రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనాథ రెడ్డి, చెంగల్ రెడ్డి, సుధాకర్, ప్రియరంజన్ రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, రఘు, రవి, ఆనంద, షాహెద్, ఫారుఖ్, నల్లంకి నరసింహులు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కనులపండువగా సీతారాముల కల్యాణం

సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త బయమ్మ, శంకరయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కనువిందుగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయం వద్ద మూడు రోజులపాటు పెద్ద ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో, తాజా పూలతో సుందరంగా అలంకరించారు. సోమవారం రాత్రి ఆలయ వద్ద సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా వాల్మీకిపురం పురో హితుల చేత జరిపించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కల్యాణో త్సవాన్ని తిలకించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో పాటల కచేరీలు, చెక్కభజనలు, కోలాటాలు, డీజేలు, కేరళ మేళ తాళాల మధ్య నాట్య ప్రదర్శనలతో వైభవంగా ఊరేగించారు. కల్యాణోత్సవం లడ్డును వెంకోజిగా రిపల్లికి చెందిన సంజీవోళ్ళ బాలు రూ.28 వేలకు దక్కించుకున్నారు. మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, యువతీ యువకులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన ఉట్ల తిరణాలలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. ఉట్ల మాను ఎక్కి విజేతగా నిలిచిన వ్యక్తిని ఘనంగా సత్కరించి రు.1,116 బహుమతిగా అందించారు. ఎస్ఐ పి.రామకృష్ణ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రాజుకు ఘనస్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

అద్దెపల్లె ప్రతాప్‌రాజుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కువైట్‌లోని ఉమేరియా గార్డన్స్‌లో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సభ సమావేశంలో పాల్గొని తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఆయన వర్గీయులు, టిడిపి శ్రేణులు టిడిపి కార్యాలయం నుంచి బ్యాండ్ మేళం, వాయిద్యాలుతో బాణా సంచా కాల్చుతూ బైక్ తాళ్ల పాక 108 విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ టిడిపి కువైట్ నాయకులు, కార్యకర్తలు, తనకు స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు ధన్యవాదాలు తెలిపారు.

జగన్ పాలనలో వడ్డింపులు, వాయింపులే

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వంలో వడ్డింపు, వాయింపులేనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తేలుకొండి పాత్రను జగన్ ప్రభుత్వం బహు సమర్ధవంతంగా నిర్వహిస్తోందని విమర్శించారు. జగన్ పాలనలో రవాణా రంగం కుదేలైందన్నారు. ఇప్పటికే వాహనాల త్రైమాసిక పన్ను పొరుగు రాష్ట్రాల కంటే 30 శాతం అధికంగా ఉందన్నారు. పెట్రోల్, డీజిల్ మీద వ్యాట్ అన్ని రాష్ట్రాల కంటే ఎపిలోనే ఎక్కువన్నారు. గ్రీన్ టాక్స్‌ను రూ.200 నుండి రూ.20 వేలకు పెంచిందని తెలిపారు. గోరుచుట్టు మీద రోకటి పోటులా రవాణా వాహనాల త్రైమాసిక పన్నును 25 శాతం పెంచుతూ 2023 మే 12న జిఒ 31న జారీ చేయడం దురదృష్టకరమని తెలిపారు. దీనివల్ల సరకుల ధరలు, బస్సు ఛార్జీలు పెరుగుతాయన్నారు. ప్రజలపై ఏటా రూ.250 కోట్లు అదనపు భారం పడుతుందని చెప్పారు. చాక్లెట్ ఇచ్చి నెక్లేస్ లాక్కోన్నట్లుంది వైసిపి పాలన తీరు అన్నారు. ప్రజా వ్యతిరేక జిఒ 31ని వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

సదరన్ క్యాంపు నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో ప్రతి వారం సదరన్ క్యాంపు క్రమం తప్పక నిర్వహించాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాల యంలో మంగళ వారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ రెండు మూడు వారాలుగా సదరన్ క్యాంపులు నిర్వహిం చడంలేదన్నారు. దీనిపై విభిన్న ప్రతిభావంతులు సోమవారం ఆందోళన చేసిన విషయం విదితమేనని తెలిపారు. తమ అవసరాల కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరుకు విభిన్న ప్రతిభావంతులకు సర్టిఫికెట్ అవసరమన్నారు. సుదూర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుండి వందల కిలో మీటర్ల దూరం నుండి వస్తున్నారన్నారు. అలాంటివారిపై అధికారుల నిర్లక్ష్యం సరైందికాదన్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్‌ను ప్రభుత్వం త్వరగా నియమించాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు శ్రీను, ధనుంజయ పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్, 8వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు వారి వివరాలను ఆన్‌లైన్‌లో జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని నంగనూరుపల్లె గ్రామంలోని శివాలయం ఎదురుగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆ పనులను ఎమ్మెల్యే పరిశీ లించారు. ఇప్పటి వరకు సుమారు రూ.15 లక్షల మేర పనులు పూర్తయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కళ్యాణ మండప నిర్మా ణానికి రూ.60 లక్షలు ఖర్చవుతున్నట్లు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పం దించి తన వంతు సాయంగా రూ.30 లక్షలు అందిస్తానని తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే రూ.10 లక్షలను తక్షణ సాయంగా అందజేశారు. ఎమ్మెల్యే వితరణపట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి శేఖర్ యాదవ్, యాలం శంకర్ యాదవ్, వేణు, నాగేంద్ర, భావన గృహ నిర్మాణ సొసైటీ చైర్మన్ గోపిరెడ్డి రమణయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాలం తులసమ్మ, ఎంపిటిసి క్రిష్టిపాటి సంధ్య, మంజు నాథ శర్మ, గ్రామ సర్పంచు శావలి లక్ష్మీదేవి, వెంకటరాముడు పాల్గొన్నారు.

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

సేంద్రియ వ్యవసాయంపై క్షేత్ర పరిశీలన

ప్రజాశక్తి-కలకడ

వేరుశనగ పొలంలో సేంద్రియ వ్యవసాయంపై కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి శాస్త్రవేత్తలు పరిశీలన చేశారు. ముడియంవారిపల్లికి చెందిన సదాశివరెడ్డి రైతు వేసిన నిత్య హరిత వేరుశనగరకంలో ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి, పశువుల ఏరువు వాడకం, వేరుశనగ పంట చుట్టూ జొన్నవేయడం, వేప నూనె పిచ్చిగారి పద్ధతుల్ని రైతు పాటించారు. ఎకరాకు 8 క్వింటాలు దిగిబట్టి రావచ్చునని అంచనా వేశారు షావుకారి, చిగురాకు రూ.17 వేలు అయిందని వివరించారు. సేంద్రియ పద్ధతి సాగు ద్వారా సాగు ఖర్చు తగ్గిందని సేంద్రియ ఉత్పత్తులు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చునని వివరిం చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సోమశేఖర్ బాబు, డాక్టర్ వై.పీరు సాహెబ్, డాక్టర్ కె.మాధురి, ఎడిఎ ఎంవి.శ్రీకాంత్, విఎఎ రెడ్డికుమార్ సర్పంచ్, రైతులు, కృషి విజ్ఞాణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ పి.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రయివేట్ వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలను నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని వారికి సూచించారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహ నానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలను కలిగి ఉండా లని తెలిపారు. అతివేగంతో వాహనాలను నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మైనర్లు ఎటువంటి వాహనాలను నడపరాదని తెలిపారు. రోడ్డుపై ప్రమాదాలను నివారించడానికి, ప్రయాణికులను గమ్య స్థలానికి సురక్షితంగా చేర్చడానికి డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బస్టాండ్‌లో ఇష్టానుసారం ఆటోలను నిలపరాదని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహ నాలను నడపవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం సిఐ మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఆమడగూరు మండలం విద్యావాండ్లపల్లి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాసులు (52) ఇతని కుమార్తె పావనిని అన్నమయ్య జిల్లా పెద్దమండెం మండలం వెలిగల్లు పంచాయితీ కొత్తవాండ్లపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణకు ఇచ్చి 9 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని తెలిపారు. కొంతకాలం కాపురం సజావుగా జరిగిందని, మదనపల్లి పట్టణంలోని పల్లె క్రాస్ రోడ్డు రామాలయం సమీపంలోని నీరుగట్టువారి పల్లెలో వేరు కాపురం పెట్టించారని, హరికృష్ణ అనుమానంతో తరచూ భార్యతో గొడవపడేవాడని తెలిపారు. పలుమార్లు పంచాయతీ జరిగిందని అదే తరహాలో గత శనివారం రాత్రి తన కుమార్తె కాపురం చక్కదిద్దాలని ఉద్దేశంతో ఆకుల శ్రీనివాసులు మరికొందరు పెద్దమనుషులు మదనపల్లి పట్టణంలోని పల్లె క్రాసు నీరు గట్టు వారి పల్లెలో తన అల్లుడైన హరికృష్ణ ఇంటిలో పంచాయతీచేసే సమయంలో ఉద్దేశపూర్వకంగా పథకం ప్రకారం తన మామ శ్రీనివాసులను తన ఇంటిలోనే తన వద్ద ఉన్న కత్తెరతో మొదట కడుపు మీద తరువాత భుజము మీద కుడి మోచేతిపై పొడవడంతో తీవ్ర రక్త గాయాలు అయ్యాయని వెంటనే శ్రీనివాసులతో వచ్చినటువంటి మేస్త్రి మరియు అతని కుమార్తె పావని చికిత్స కోసం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అదే రోజు రాత్రి ఏడు గంటల 45 నిమిషాలకు శ్రీనివాసులు చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు. శ్రీనివాసులు కుమార్తె అయిన పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరికృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. అతనిపై రౌడీ షీట్ ఓపెన్ కూడా చేశామన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి- కలకడ

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ కాలువ గడ్డ వేదిక చెందిన అబ్దుల్ అజీజ్ కుమారుడు మహబూబ్ బాషా తన ఇంటి ముందర సోమవారం రాత్రి తన ద్విచక్ర వాహనం నిలిపి ఉండగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నా ద్విచక్ర వాహనాన్ని దొంగలించినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహబూబ్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-రామసముద్రం

కర్ణాటక నుండి అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కుదురుచీమనపల్లి గ్రామానికి చెందిన రవికుమార్, కట్టా రవి మంగళవారం బోర్డర్ చెక్ పోస్ట్ మార్గం ద్వారా 120 టెట్రా ప్యాకెట్ల మద్యం తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణ పరిసరాల్లో చోరీకి గురైన ఐదు ద్విచక్ర వాహనాలతో సహా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్లో సిఐ మాట్లాడుతూ పీలేరు, ఇతర మండలాల్లో జరిగిన మోటార్ సైకిల్ దొంగతనాలపై పీలేరు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, కలికిరి మండలానికి చెందిన దేరంగుల శివ, మేడుకుర్తి సందీప్ కుమార్‌లను ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది అరెస్టు చేశారన్నారు. నిందితుల నుంచి ఐదు మోటార్ వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని చెప్పారు. ముద్దాయిలను రిమాండుకు తరలించామన్నారు.

పట్టుబడిన నిందితులు, వాహనాలతో పీలేరు పోలీసులు